ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | బుధవారం 25, నవంబర్ 2026 | పేజీలు: 4 | వెల: రూ.1



120 సీట్లు అడిగితే 26 సీట్లిస్తారా?

- యూపీలో కాంగ్రెస్‌కు 26 సీట్లు ఆఫర్ చేసిన సమాజ్‌వాదీ పార్టీ
- విషయాన్ని స్వయంగా మీడియాకు వెల్లడించిన ఎస్పీ ఎంపీ రాజీవ్ రాయ్
- మొదట 181 సీట్లు కోరి, ఆపై 100-120కి తగ్గిన కాంగ్రెస్
- సీట్ల సంఖ్య కంటే గెలుపు గుర్రాలే ముఖ్యమంటున్న అఖిలేష్
- అమేఠీ, రాయ్‌బరేలీ, మైన్‌పురి స్థానాల రక్షణకు సమాలోచనలు

2



2

తెలంగాణ మహిళలకు చిలకపచ్చ చీరలు..

- నవంబర్ 26న తెలంగాణలో ప్రారంభం కానున్న ఇందిరమ్మ చీరల పంపిణీ
- నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- రేషన్ కార్డు కలిగిన 18 ఏళ్లు పైబడిన కోటి మంది మహిళలకు లబ్ధి



2

మరణశిక్ష ఉన్నా వెనక్కి తగ్గేది లేదు..

- స్వదేశానికి తిరిగి వచ్చే తేదీని ప్రకటించిన షేక్ హసీనా
- డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు రానున్నట్లు వెల్లడి
- హసీనా ప్రకటనతో బంగ్లాదేశ్‌లో పెరిగిన రాజకీయ ఉద్రిక్తతలు
- తిరిగి రప్పించడం ప్రభుత్వ బాధ్యత అన్న ఆమె ప్రతినిధి

హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత రిజిస్ట్రేషన్

హైదరాబాద్, (ప్రజాస్వరం):

హైదరాబాద్ మహానగరంలో పేదలకు సొంతిల్లు అందించే లక్ష్యంలో భాగంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి దాదాపు రూ.50 నుంచి రూ. 60 లక్షల విలువైన ఆస్తిని అందించడంతో పాటు,

మిగతా 2 లో..

- పేదలకు రూ.60 లక్షల విలువైన ఇల్లు
- ఉచితంగా ఇంటి రిజిస్ట్రేషన్
- ఇందిరమ్మ టవర్స్‌తో సొంతింటి కల సాకారం
- టీజీ రెరాలో ఇందిరమ్మ టవర్స్ నమోదు
- ప్రభుత్వ గృహ నిర్మాణంలో కీలక ముందడుగు
- సామాన్యులకు అండగా ప్రజా ప్రభుత్వం
- పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన





ఏల్నాడు ప్రాజెక్టులో రేవంత్ అడ్డంగా దొరికారు

- టెండర్ల తర్వాతే ప్రభుత్వ ఎదురుదాడి
- ముందే టెండర్లు పిలిస్తే ఎందుకు స్పందించలేదు?
- కేటీఆర్ బయటపెట్టాకే కదలిక
- బ్యాక్ డేట్‌తో ఉత్తరాలు రాశారు
- రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్
- నీటిపారుదల శాఖ తీరుపై విమర్శలు
- ఎదురుదాడితో తప్పించుకోలేరు

హైదరాబాద్, (ప్రజాస్వరం):

నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ అంశంలో తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం తీవ్రరూపం దాల్చింది. ఈ ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడ్డంగా దొరికిపోయి, తప్పించుకునేందుకు ఎదురుదాడి చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆరోపించారు.

పల్నాడు ప్రాజెక్టు టెండర్ల వ్యవహారాన్ని పత్రికలు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బయటపెట్టిన తర్వాతనే రేవంత్ ప్రభుత్వం బ్యాక్ డేట్‌తో ఉత్తరాలు రాసిందని హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు 2025 జనవరి 24నే టెండర్లు పిలిచారని, అప్పుడే ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. నీటిపారుదల శాఖ మంత్రి సొంత జిల్లాలో ఇంత జరుగుతున్నా

మిగతా 2 లో..



గ్రీన్ ట్యాంకర్లలో మురుగు నీరా?

- గ్రీన్ ట్యాంకర్లలో నేరుగా మురుగు నీరు?
- శుద్ధి చేయని నీటి సరఫరాపై ఆరోపణలు
- ఖాజాగూడ నాలా నుంచి ట్యాంకర్లలోకి మురుగు నీరు
- జలమండలి పర్యవేక్షణపై ప్రశ్నలు
- గ్రీన్ ట్యాంకర్ల నీటి నాణ్యతపై అనుమానాలు
- శుద్ధి నీటి సరఫరాలో అక్రమాలా?
- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు
- గ్రీన్ ట్యాంకర్ల సేవలపై కలకలం

హైదరాబాద్, (ప్రజాస్వరం):

హైదరాబాద్‌లో గ్రీన్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాపై తీవ్ర చర్చ మొదలైంది. గార్డెనింగ్, ల్యాండ్ స్కేపింగ్, నిర్మాణ అవసరాల కోసం శుద్ధి చేసిన మురుగు నీటిని అందించాలనే లక్ష్యంతో జలమండలి ప్రారంభించిన గ్రీన్ ట్యాంకర్ల సేవలపై తాజాగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఖాజాగూడలోని ఓ నాలా నుంచి ఎలాంటి శుద్ధి ప్రక్రియ లేకుండానే.. మురుగు నీటిని నేరుగా గ్రీన్ ట్యాంకర్లలో నింపుతున్నట్లు ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది.

తాగునీటి అవసరాలకు కాకుండా ఇతర పనులకు శుద్ధి చేసిన మురుగు నీటిని వినియోగించాలనే ఉద్దేశంతో జలమండలి ఈ గ్రీన్ ట్యాంకర్ల విధానాన్ని తీసుకొచ్చింది. నవంబర్ 1న ఈ సేవలను అధికారికంగా ప్రారంభించింది. ఎస్టీపీల (మురుగు నీటి శుద్ధి కేంద్రాలు)లో శుద్ధి చేసిన నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే ఖాజాగూడలో మాత్రం నాలాలోని మురుగు నీటినే నేరుగా ట్యాంకర్లలోకి ఎక్కిస్తున్నారన్న ఆరోపణలు ఇప్పుడు అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. గ్రీన్ ట్యాంకర్లలో నింపుతున్న నీటిని ఎక్కడి

మిగతా 2 లో..

యువత భవిష్యత్తుకు డ్రగ్స్ పెను ముప్పు

- డ్రగ్స్ మహమ్మారి యువత జీవితాలను నాశనం చేస్తోంది.
- మాదకద్రవ్యాల వినియోగంతో దేశాభివృద్ధికి తీవ్ర విఘాతం.
- నవంబర్ 25 నుంచి మూడు రోజుల పాటు 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర.
- హైదరాబాద్‌లో పాదయాత్ర వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.
- డ్రగ్స్ విక్రయాల డబ్బు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగం.
- తెలంగాణలో ఈగల్ టీమ్‌ల పనితీరు బాగుంది.. మరింత విస్తరించాలి.
- డ్రగ్స్ నియంత్రణకు 2029 చివరి వరకు లక్ష్యం నిర్దేశం.
- విదేశాల నుంచి మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చర్యలు

హైదరాబాద్, (ప్రజాస్వరం):

దేశంలో డ్రగ్స్ మహమ్మారి తీవ్ర ఆందోళన కలిగిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం యువత జీవితాలను, దేశ అభివృద్ధిని దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రేపటి (నవంబర్ 25) నుంచి మూడు రోజుల పాటు 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి.. దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో డ్రగ్స్ సమస్య ఒకటని పేర్కొన్నారు.

'దేశంలో ఎక్కడ చూసినా యువత డ్రగ్స్‌కు బానిసలయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఒకప్పుడు ఎంతో

మిగతా 2లో..



ఏపీ, తెలంగాణ మధ్య వివాదాలు వద్దు.

- ఏపీ, తెలంగాణ మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలి : కవిత
- రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదాలు బాధాకరం
- సీఎం రేవంత్ రెడ్డి ఒంటెత్తు పోకడతో సమస్యలు పెరుగుతున్నాయి
- నీటి వివాదాలు, అక్రమాలపై చంద్రబాబు స్పందించాలి
- అక్రమాలను అరికట్టేందుకు ఏపీ సీఎం చొరవ చూపాలి
- రాష్ట్ర విభజన జరిగినా పరస్పర సహకారం అవసరం
- ప్రజల ప్రయోజనాలే ప్రాధాన్యంగా సమస్యలు పరిష్కరించాలి
- నీటి వివాదాలపై ప్రభుత్వాలు చొరవ చూపాలి



హైదరాబాద్, (ప్రజాస్వరం):

తూర్పుగోదావరి జిల్లా జిల్లాలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, తెలంగాణ రక్షణ సేన (TRS) అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు.. రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు స్నేహపూర్వక వాతావరణంలో ఉండాలని ఆకాంక్షించారు. అయితే ఇరు రాష్ట్రాల మధ్య

మిగతా 2లో..

కార్తీక పౌర్ణమి వేళ.. శివాలయాలకు పోటెత్తిన భక్తులు!

- తెలుగు రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక సందడి
- ప్రముఖ శైవక్షేత్రాలకు భక్తుల తాకిడి
- వేకువజాము నుంచే ఆలయాల్లో రద్దీ
- గోదావరి, కృష్ణా తీరాల్లో పుణ్యస్నానాలు
- నదుల్లో కార్తీక దీపాల వెలుగులు
- 365 వత్తులతో మహిళల దీపారాధనలు
- ప్రత్యేక పూజలు,
- అభిషేకాలతో మార్మోగిన ఆలయాలు

హైదరాబాద్, (ప్రజాస్వరం):

కార్తీక మాసం పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే ప్రముఖ శైవక్షేత్రాలకు భక్తులు

మిగతా 3లో..



తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా గ్లోబల్ సమ్మిట్

- భారత్ ఫ్యూచర్ సిటీలో సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన శ్రీధర్ బాబు
- డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026
- సమ్మిట్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశం



హైదరాబాద్, (ప్రజాస్వరం):

హైదరాబాద్ శివారులోని భారత్ ఫ్యూచర్ సిటీలో త్వరలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' ఏర్పాట్లను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వేదిక నిర్మాణం, ఎక్స్‌పో జోన్, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, అతిథుల వసతి తదితర అంశాలపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. సమ్మిట్ ఏర్పాట్లను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరిగేలా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ పారిశ్రామిక, ఆర్థిక

మిగతా 2లో..

గ్రీన్ ట్యాంకర్లలో మురుగు నీరా?

మొదటిపేజీ తరువాయి

నుంచి సేకరిస్తున్నారు?.. శుద్ధి చేసిన నీటిని అందించాల్సిన వ్యవస్థలోకి మురుగు నీరు ఎలా చేరిందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ట్యాంకర్లలో నింపే నీటి నాణ్యతను ఎవరు పరీక్షిస్తున్నారు?.. నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థ ఉందా? అన్న అంశాలపైనా చర్చ జరుగుతోంది.

శుద్ధి చేయని మురుగు నీటిని గార్డెనింగ్, ల్యాండ్‌స్కేపింగ్, నిర్మాణ పనులకు వినియోగిస్తే ప్రజారోగ్యంతో పాటు పర్యావరణంపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గ్రీన్ ట్యాంకర్ల పేరుతో నిజంగానే నాలా నీటిని సరఫరా చేస్తుంటే అందుకు బాధ్యులెవరు?.. ఎవరి అనుమతితో ఈ నీటిని ట్యాంకర్లలో నింపుతున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై జలమండలి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ఖాజాగూడలో ట్యాంకర్లకు నీటిని ఎక్కడి నుంచి నింపుతున్నారు?.. నిజంగా శుద్ధి చేయని మురుగు నీటిని వినియోగిస్తున్నారా?.. అలా చేస్తుంటే ఎవరి అనుమతితో ఈ పని జరుగుతోంది? అనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. గ్రీన్ ట్యాంకర్ల సరఫరా విధానంపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, నీటి వనరులు, శుద్ధి ప్రక్రియ, నాణ్యత పర్యవేక్షణ వివరాలను స్పష్టం చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.



మరణశిక్ష ఉన్నా వెనక్కి తగ్గేది లేదు..

- **స్వదేశానికి తిరిగి వచ్చే తేదీని ప్రకటించిన షేక్ హసీనా**
- **డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు రానున్నట్లు వెల్లడి**
- **హసీనా ప్రకటనతో బంగ్లాదేశ్‌లో పెరిగిన రాజకీయ ఉద్రిక్తతలు**
- **తిరిగి రప్పించడం ప్రభుత్వ బాధ్యత అన్న ఆమె ప్రతినిధి**

నేషనల్‌బ్యూరో, (ప్రజాస్వరం):

భారత్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా, స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. బంగ్లాదేశ్ 'విజయ దినోత్సవం' అయిన డిసెంబర్ 16న ఢాకాలో అడుగుపెట్టనున్నట్లు ఆమె మంగళవారం సంచలన ప్రకటన చేశారు. 2024 ఆగస్టులో విద్యార్థి ఉద్యమంతో గద్దె దిగిన తర్వాత ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్న విషయం తెలిసిందే. గతంలో తన రాకపై సంకేతాలు ఇచ్చినా, కచ్చితమైన తేదీని ప్రకటించడం ఇదే తొలిసారి కావడంతో బంగ్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

ఢిల్లీ నుంచి ఢాకాకు తమ జాతీయ విమాన యాన సంస్థ 'బిమాన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్' ద్వారా విమానాన్ని ఏర్పాటు చేయాలని ఆమె బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై హసీనా ప్రతినిధి సయ్యద్ మొజమ్మెల్ అలీ మాట్లాడుతూ, "ఆగస్టు 5, 2024న ఆమెను బంగ్లాదేశ్ విమానంలోనే బలవంతంగా భారత్‌కు పంపారు. రాజ్యాంగ విరుద్ధంగా బహిష్కరించినందున, విజయ దినోత్సవం రోజున ఆమెను గౌరవంగా తిరిగి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని వ్యాఖ్యానించారు. ఇప్పటికే తన పాస్‌పోర్ట్, ఇతర ప్రయాణ పత్రాలను పునరుద్ధరించాలని ఆమె ఈ నెల ప్రారంభంలో దరఖాస్తు చేసుకున్నారు.

2024లో జరిగిన విద్యార్థి ఆందోళనల సందర్భంగా నిరసనకారులపై అణచివేతకు ఆదేశాలు ఇచ్చారన్న ఆరోపణలతో షేక్ హసీనా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ ఘటనల్లో సుమారు 1,400 మంది మరణించినట్లు ఐక్యరాజ్యసమితి నివేదికలు పేర్కొన్నాయి. ఈ కేసులో విచారణ జరిపిన బంగ్లాదేశ్ యుద్ధ నేరాల న్యాయస్థానం, ఆమె దేశంలో లేని సమయంలోనే గతేడాది నవంబర్‌లో మరణశిక్ష విధించింది. అయితే, ఈ ఆరోపణలను హసీనా మొదటి నుంచి ఖండిస్తున్నారు. "మరణశిక్ష మూల్యం చెల్లించాల్సి వచ్చినా సరే, స్వదేశానికి తిరిగి వెళ్లాలన్న తన నిర్ణయంలో మార్పు లేదు" అని ఆమె ఇటీవల ప్రకటించినట్లు కథనాలు వెలువడ్డాయి.

ప్రస్తుతం హసీనా ప్రకటనపై బంగ్లాదేశ్ ప్రభుత్వం అధికారికంగా స్పందించలేదు. అయితే, మరణశిక్ష ఎదుర్కొంటున్న ఆమె తిరిగి వస్తే అరెస్ట్ చేసి జైలుకు పంపుతామని, ఆమెను తీసుకురావడానికి భారత్‌తో ఎలాంటి చర్చలు జరగలేదని ఆ దేశ మంత్రి ఒకరు ఇటీవల రాయిటర్స్‌కు తెలిపారు. హసీనా తిరిగి వచ్చే ప్రయత్నాలు ప్రారంభించినప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో ఆమె పార్టీ కార్యకర్తలపై దాడులు, హింసాత్మక ఘటనలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఆమె రాక దేశంలో తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

120 సీట్లు అడిగితే 26 సీట్లిస్తారా?

- **యూపీలో కాంగ్రెస్‌కు 26 సీట్లు ఆఫర్ చేసిన సమాజ్‌వాదీ పార్టీ**
- **విషయాన్ని స్వయంగా మీడియాకు వెల్లడించిన ఎస్పీ ఎంపీ రాజీవ్ రాయ్**
- **మొదట 181 సీట్లు కోరి, ఆపై 100-120కి తగ్గిన కాంగ్రెస్**
- **సీట్ల సంఖ్య కంటే గెలుపు గుర్రాలే ముఖ్యమంటున్న అఖిలేష్**
- **అమేథీ, రాయ్‌బరేలీ, మైన్‌పురి స్థానాల రక్షణకు సమాలోచనలు**

నేషనల్‌బ్యూరో, (ప్రజాస్వరం):

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సీట్ల సర్దుబాటు వ్యవహారంలో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) కాంగ్రెస్‌కు ఊహించని షాక్ ఇచ్చింది. 'ఇండియా' కూటమిలో భాగంగా కాంగ్రెస్‌కు కేవలం 26 స్థానాలు మాత్రమే ఇవ్వాలని అఖిలేష్ యాదవ్ పార్టీ ప్రతిపాదించింది. రెండో విడత సీట్ల చర్చలకు ముందు ఎస్పీ ఎంపీ రాజీవ్ రాయ్ మంగళవారం ఈ సంచలన విషయాన్ని మీడియా ముందు వెల్లడించారు. తాము ప్రస్తుతానికి 26 సీట్లను ఆఫర్ చేశామని, తదుపరి సమావేశాల్లో మరింత లోతుగా చర్చలు జరుపుతామని స్పష్టం చేశారు. 2027 యూపీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ తొలుత ఏకంగా 181 స్థానాలు కావాలని డిమాండ్ చేసింది. అయితే ఎస్పీ నుంచి ప్రతిఘటన ఎదురుకావడంతో వెనక్కి తగ్గి, సోమవారం ఢిల్లీలో జరిగిన తొలి సమావేశంలో 100 నుంచి 120 స్థానాల జాబితాను సమర్పించింది. సుమారు 70 నుంచి 80 సీట్లను వదులుకుంటూ కాంగ్రెస్ పట్టు తగ్గించినప్పటికీ.. ఎస్పీ మాత్రం కేవలం 26 స్థానాలకే పరిమితం చేయడం కూటమిలో కాకరేపుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, రాహుల్ గాంధీ జాతీయ ఇమేజ్‌ను బట్టి తమకు ఎక్కువ స్థానాలు దక్కాలని హస్తం నేతలు వాదిస్తున్నారు.

సీట్ల సంఖ్య కంటే అభ్యర్థుల గెలుపు అవకాశాలే కూటమికి ముఖ్యమని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ స్పష్టం చేస్తున్నారు. నియోజకవర్గాల్లో పార్టీల బలాబలాలు, ఓటర్ల నాడి ఆధారంగానే సీట్లు కేటాయించాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ కంచుకోటలైన అమేథీ, రాయ్‌బరేలీతో పాటు ఎస్పీకి పట్టున్న మైన్‌పురి, ఇటావా వంటి స్థానాల్లో ఒకరికొకరు మద్దతుగా ఉండాలనే ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఢిల్లీలోని కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ ప్రమోద్ తివారీ నివాసంలో జరిగిన తొలి భేటీ కేవలం 20 నిమిషాల్లోనే ముగిసింది. ఇప్పుడు రెండో విడత చర్చల్లో స్థానాల సంఖ్యపై ఇరు పార్టీలు ఎలాంటి రాజీకి వస్తాయో అన్నది ఉత్కంఠగా మారింది.

హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత రిజిస్ట్రేషన్

మొదటిపేజీ తరువాయి

ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. సామాన్యుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని, ఈ క్రమంలో ఇందిరమ్మ టవర్స్‌కు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రెరా)లో రిజిస్ట్రేషన్ పూర్తి కావడం ఒక కీలక ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. ఒక ప్రభుత్వ గృహ నిర్మాణ ప్రాజెక్టు తొలిసారిగా రెరాలో నమోదు కావడం ప్రజా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని మంగళవారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపారు.

ఆలస్యమైతే ఫిర్యాదు చేసే అవకాశం:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇళ్లు అప్పగించే వరకు ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనంతో ముందుకు సాగుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. శంకుస్థాపన జరిగిన ఏడాదిలోపు టవర్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అప్పగిస్తామని చెప్పారు. రెరాలో రిజిస్ట్రేషన్ కావడం వల్ల నిర్మాణంలో జాప్యం జరిగినా, నిబంధనలను ఉల్లంఘించినా లబ్ధిదారులు నేరుగా రెరాకు ఫిర్యాదు చేసే అవకాశం లభించిందన్నారు. ఫిర్యాదు అందితే బిల్డర్లకు నోటీసులు జారీ చేయడంతో పాటు, సంతృప్తికరమైన వివరణ లేకపోతే జరిమానా కూడా విధించే అవకాశం ఉంటుందన్నారు.

ప్రాజెక్టు ముఖ్యాంశాలు ఇవే..

క్యూఆర్ (ఓఆర్ఆర్) పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్లు నిర్మిస్తుండగా, ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో పనులు ప్రారంభమయ్యాయి. ఒక్కో నియోజకవర్గంలో 4 టవర్ల చొప్పున, ఒక్కో టవర్‌లో 120 ఫ్లాట్లు కలిపి మొత్తం 480 ఫ్లాట్లు నిర్మిస్తున్నారు. ఒక్కో ఫ్లాట్ నిర్మాణానికి రూ. 11 లక్షలు ఖర్చవుతుండగా, ప్రభుత్వం రూ. 5 లక్షలు సబ్సిడీగా ఇస్తోంది. మిగతా రూ. 6 లక్షలను లబ్ధిదారులు నాలుగు విడతల్లో చెల్లించాల్సి ఉంటుంది. పారదర్శకత కోసం ప్రతి నియోజకవర్గానికి హౌసింగ్ బోర్డు, బిల్డర్, లబ్ధిదారుల పేర్లతో మూడు ప్రత్యేక ఎస్క్రో (Escrow) బ్యాంకు ఖాతాలను తెరిచారు. పనుల పురోగతిని బట్టి బిల్డర్లకు నిధులు విడుదల చేస్తారు. ఇందిరమ్మ టవర్స్ ప్రాజెక్టులకు సంబంధించిన రెరా అనుమతి పత్రాలను సోమవారం రెరా చైర్మన్ శ్రీనివాసరాజు నుంచి హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వీపీ గౌతమ్ అందుకున్నారు. దీనివల్ల ప్రాజెక్టులపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని గౌతమ్ పేర్కొన్నారు.

పల్నాడు ప్రాజెక్టులో రేవంత్ అడ్డంగా దొరికారు

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వానికి సోయి లేదని, తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు గొంతు పెంచితే సరిపోదని ఆయన మండిపడ్డారు. మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వివాదంపై స్పందిస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వమే దీనికి బాధ్యత వహించాలని తెలిపారు. 2022 ఫిబ్రవరి 16న నాటి వైఎస్ జగన్ ప్రభుత్వం జీవో నెం. 56 జారీ చేసినప్పుడు కేసీఆర్ ప్రభుత్వం ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ విషయాన్ని గుర్తించి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి ప్రాజెక్ట్ పనులను అడ్డుకునే ప్రయత్నం చేశామని సీఎం వివరించారు. ఇదే సమయంలో, ఆంధ్ర ప్రదేశ్ అధికారులు స్పందిస్తూ.. కేటాయించిన వాటా నుంచే 1.865 టీఎంసీల తాగునీటిని తీసుకుంటున్నామని, దీనికి కొత్త అనుమతులు అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు.



తెలంగాణ మహిళలకు చిలకపచ్చ చీరలు..

- **నవంబర్ 26న తెలంగాణలో ప్రారంభం కానున్న ఇందిరమ్మ చీరల పంపిణీ**
- **నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి**
- **రేషన్ కార్డు కలిగిన 18 ఏళ్లు పైబడిన కోటి మంది మహిళలకు లబ్ధి**

హైదరాబాద్, (ప్రజాస్వరం):

రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన మహిళలకు 'ఇందిరమ్మ చీరల' పంపిణీ చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాజ్యాంగ దినోత్సవమైన నవంబర్ 26న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. 'ఇందిరా మహిళా శక్తి' పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి మంది మహిళలకు రామచిలుక రంగు (ప్యారెట్ గ్రీన్) చీరలను అందించనున్నారు. ఆహార భద్రత లేదా రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లోని 18 ఏళ్లకు పైబడిన మహిళలను ఈ పథకానికి లబ్ధిదారులుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 65 లక్షల మంది, పట్టణ ప్రాంతాలకు చెందిన 35 లక్షల మంది మహిళలు ఉన్నారు. మొత్తం కోటి చీరల్లో 6.30 మీటర్ల పొడవు కలిగిన పాలిస్టర్ చీరలు 95 లక్షలు కాగా, 9 మీటర్ల పొడవు ఉండే పాలీకాటన్ చీరలు 5 లక్షలు ఉన్నాయి. స్థానిక చేనేత రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు సిరిసిల్ల తదితర ప్రాంతాల్లోని నేత కార్మికులకు చేతినిండా పని కల్పించే ఉద్దేశంతో ఈ చీరల తయారీ బాధ్యతలను వారికి అప్పగించారు. ఈ పంపిణీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను వినియోగిస్తున్నారు. అర్హులైన మహిళలు తమ గ్రామాలు, వార్డుల్లోని పంపిణీ కేంద్రాల వద్ద రేషన్ కార్డు, ఆధార్ వివరాలను సమర్పించి చీరలను తీసుకోవచ్చు. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని నవంబర్ 19న ప్రారంభించాలని తొలుత నిర్ణయించినప్పటికీ, అనివార్య కారణాలతో నవంబర్ 26కు రీషెడ్యూల్ చేశారు. జిల్లా కలెక్టర్లు, జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రుల పర్యవేక్షణలో ఈ పంపిణీ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగనుంది.



తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి పవిత్ర కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు వేముల మహేందర్ గౌడ్

భూపాలపల్లి,నవంబర్ 24,I(ప్రజాస్వరం):



తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీసీ బంధువులందరికీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ కార్తీక పౌర్ణమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సకల పాపహరణి, మోక్షప్రదాయిని అయిన పవిత్ర కార్తీక మాసంలో, దివ్యమైన, మహోత్కృష్టమైన కార్తీక పౌర్ణమి పర్వదినం అత్యంత విశిష్టమైనదన్నారు. జ్ఞానజ్యోతిని ప్రసాదించి, అజ్ఞాన తిమిరాన్ని తొలగించే దీపారాధన శోభతో, దీపకాంతుల దివ్య తేజస్సుతో ప్రతి ఒక్కరి జీవితం ప్రకాశించాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఈ శుభ పర్వదినాన పరమ పవిత్రుడు, కరుణామయుడు, భోళా శంకరుడైన ఆ పరమేశ్వరుని కృపా కటాక్ష వీక్షణములతో, ఆ జగజ్జనని ఆశీస్సులతో ప్రజలందరికీ సకల సౌభాగ్యములు, ఆయురారోగ్య ఐశ్వర్యములు, సుఖశాంతులు, అష్టైశ్వర్య సిద్ధులు కలగాలని మనసారా కోరుకుంటున్నానన్నారు. ఈ పుణ్య తిథి రాష్ట్రంలో సర్వజనుల మధ్య సౌభ్రాతృత్వాన్ని, సామరస్యాన్ని, సోదర భావాన్ని మరింత పరిఢవిల్లజేయాలని, మన తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధితో, సుభిక్షంగా, సస్యశ్యామలంగా విరాజిల్లాలని ఆ దేవదేవుని పాదపద్మములకు ప్రార్థిస్తున్నాను" అని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ మోసగాడైతే.. కాంగ్రెస్ మోసగాళ్లకు మోసగాడు!

- **బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటే**
- **కాంగ్రెస్‌పై రామచందర్ రావు ఫైర్**
- **మోసగాళ్ల భరతం పడతాం**
- **తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుంది**
- **ప్రాంతీయ పార్టీలపై ఆధారపడుతున్న కాంగ్రెస్**
- **యూపీలో కాంగ్రెస్‌కు 26 సీట్లేనా?**

హైదరాబాద్, (ప్రజాస్వరం):

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు ఒక్కటేనని బీఆర్ఎస్ మోసగాడు అయితే కాంగ్రెస్ మోసగాళ్లకు మోసగాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. ఈ మోసగాళ్ల భరతం పట్టడానికి తెలంగాణలో బీజేపీ ధురందర్ అధికారంలోకి రాబోతోందన్నారు. ఇవాళ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ పార్టీ ఇతర ప్రాంతీయ పార్టీలపై ఆధారపడుతూ సబ్ రీజనల్ పార్టీగా మారుతోందని ఎద్దేవా చేశారు. అందుకే యూపీలో కేవలం ఆ పార్టీకి 26 స్థానాలు మాత్రమే ఇచ్చేందుకు ఎస్పీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

సెంటిమెంట్ రగిలించే ప్రయత్నం..

నీటి విషయంలో సెంటిమెంట్ రగిలించి లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. కృష్ణా జలాల్లో కర్ణాటక నుంచి రావాల్సిన వాటాను ఎందుకు తీసుకురాలేకపోతున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నీటి విషయంలో సెంటిమెంట్ రగిలించే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ఎల్ నినో ప్రభావంతో ఓ వైపు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మరో వైపు గ్లోబల్ సమ్మిట్ ఏంటని ప్రశ్నించారు. పెట్టుబడులు తీసుకువస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదని కానీ సమ్మిట్ పేరుతో ప్రభుత్వ డబ్బులు దుబారా చేయడం ఏంటన్నారు. మొన్న జరిగిన భారత్ సమ్మిట్‌కు ప్రభుత్వ నిధులు ఎలా కేటాయించారని ప్రశ్నించారు.

యువత భవిష్యత్తుకు డ్రగ్స్ పెను ముప్పు

మొదటిపేజీ తరువాయి

గొప్పగా ఉన్న పంజాబ్ రాష్ట్రం డ్రగ్స్ మహమ్మారి కారణంగా నిర్వీర్యమవుతోంది. ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు కూడా ఈ సమస్య విస్తరించింది. ఇప్పటికైనా అప్రమత్తం కాకపోతే దేశ అభివృద్ధితో పాటు యువత భవిష్యత్తును కాపాడుకోవడం కష్టమవుతుంది. డ్రగ్స్ తీసుకోవడం వల్ల వ్యక్తులు విచక్షణ కోల్పోయి కుటుంబాలకు, సమాజానికి భారంగా మారుతున్నారు. మాదకద్రవ్యాల విక్రయం ద్వారా వచ్చే డబ్బును దేశ వ్యతిరేక కార్యకలాపాలకు, ఉగ్రవాదానికి సహాయం అందించేందుకు ఉపయోగిస్తున్నారు. న్యూక్లియర్ కుటుంబాల పెరుగుదల, యువత స్వేచ్ఛను కోరుకునే ధోరణి కూడా డ్రగ్స్ వినియోగం పెరగడానికి కారణాలుగా మారుతున్నాయి' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

తెలంగాణలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలను కిషన్ రెడ్డి ప్రశంసించారు. ముఖ్యంగా ఈగల్ టీమ్‌లు బాగా పనిచేస్తున్నాయని, అయితే వాటి కార్యకలాపాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. డ్రగ్స్ సమస్య చాలా పెద్దదని, దీనిని పూర్తిగా నియంత్రించేందుకు 2029 చివరి వరకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. విదేశాల నుంచి దేశంలోకి డ్రగ్స్ రాకుండా అడ్డుకునేందుకు ఆయా దేశాలతో భారత్ ఒప్పందాలు చేసుకుంటోందని తెలిపారు. భారత నిఘా సంస్థలు కూడా ఆయా దేశాలకు వెళ్లి డ్రగ్స్ అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకుంటున్నాయని ఆయన వివరించారు. యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణలో తగినన్ని క్రీడా మైదానాలు లేవని పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వం కొత్త క్రీడా మైదానాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. యువతకు క్రీడలు, ఆరోగ్యకరమైన కార్యకలాపాలపై ఆసక్తి పెంచడం ద్వారా డ్రగ్స్ వంటి వ్యసనాల నుంచి వారిని దూరంగా ఉంచవచ్చని ఆయన పేర్కొన్నారు. 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర బుధవారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి ప్రారంభమై.. 27వ తేదీ సాయంత్రం వరకు కొనసాగుతుందని కిషన్ రెడ్డి తెలిపారు. ఫిల్మ్‌నగర్‌లో పాదయాత్ర ముగుస్తుందని చెప్పారు. ఇది మొదటి విడత కార్యక్రమమని, రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పోలీస్ కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులను కూడా ఆహ్వానించినట్లు వెల్లడించారు.

తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా గ్లోబల్ సమ్మిట్

మొదటిపేజీ తరువాయి



సామర్థ్యాన్ని చాటిచెప్పేందుకు ఈ వేదిక అత్యంత కీలకమని పేర్కొన్నారు. పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.

భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఈ సదస్సు జరగనుంది. ఈ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా సుమారు 1,500 మందికి పైగా సీఈవోలు, పెట్టుబడిదారులు, దౌత్యవేత్తలు హాజరుకానున్నారు. అలాగే డిఫెన్స్, ఫార్మా, గేమింగ్, ఏఐ వంటి కీలక రంగాల నుంచి 1,000 కంటే ఎక్కువ కంపెనీలు పాల్గొనేలా మల్టీ సెక్టార్ ఎక్స్‌పోను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

భద్రతా పరంగా ఫేషియల్ రికగ్నిషన్ వంటి అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంది.

ఏపీ, తెలంగాణ మధ్య వివాదాలు వద్దు.

మొదటిపేజీ తరువాయి



నీటి వివాదాలు తలెత్తడం విచారకరమని ఆమె అభిప్రాయపడ్డారు. కొవ్వూరు పట్టణంలో నిర్వహించిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన జరిగినప్పటికీ పరస్పర సహకారం, స్నేహభావంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.

అయితే ప్రస్తుతం రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదాలు నెలకొనడం బాధాకరమని కవిత అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒంటెత్తు పోకడతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వైఖరి వల్ల రెండు రాష్ట్రాల మధ్య సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇక, నీటి వివాదాలు, అక్రమాల అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించాలని కవిత కోరారు. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకుని, అక్రమాలను అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రెండు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు TRS అధ్యక్షురాలు కవిత..

మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో మెదక్ అభివృద్ధికి నూతన శకం

- **విమర్శలు చేసే ముందు మీ హయాంలో ఏం చేశారో చెప్పండి...**
- **మున్సిపల్ వైస్ చైర్మన్ డి. నరేష్ గౌడ్**

మెదక్, నవంబర్ 24 (ప్రజాస్వరం):

మెదక్ పట్టణ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు చేస్తున్న కృషిని చూసి ఓర్వలేకే కొందరు రాజకీయ విమర్శలకు దిగుతున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ డి. నరేష్ గౌడ్ అన్నారు. అభివృద్ధి పనులపై విమర్శలు చేసే ముందు గతంలో అధికారంలో ఉన్నప్పుడు పట్టణానికి ఏం చేశారో ప్రజలకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాందాస్ చౌరస్తాలో చేపడుతున్న సుందరీకరణ పనులు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయని, పనులు పూర్తికాకముందే ప్రమాదకరమైన రాడ్లు, మేకులంటూ విమర్శలు చేయడం సరికాదన్నారు. నిర్మాణ పనుల తుది రూపాన్ని పరిశీలించిన తర్వాతే మాట్లాడాలని సూచించారు. ప్రజల భద్రతకు సంబంధించిన సూచనలను స్వాగతిస్తామని, భద్రత విషయంలో మున్సిపాలిటీ ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని స్పష్టం చేశారు.గతంలో మున్సిపల్ పాలనలో కీలక బాధ్యతలు నిర్వహించిన వారు తమ హయాంలో మెదక్ అభివృద్ధికి చేసిన కృషిని ముందుగా ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, చౌరస్తాల సుందరీకరణ తో పాటు పలు మౌలిక సదుపాయాల కల్పన కు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మెదక్ పట్టణానికి ఆధునిక రూపు తీసుకురావాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. మున్సిపల్ పాలకవర్గం ఆయన మార్గదర్శకత్వంలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. రాజకీయ విమర్శలతో అభివృద్ధిని అడ్డుకోలేరని, మాటలతో కాకుండా చేపట్టిన అభివృద్ధి పనులతోనే విమర్శలకు సమాధానం చెబుతామని డి. నరేష్ గౌడ్ పేర్కొన్నారు.



తక్కువ ఖర్చుతో ఆధునిక వైద్యం పేదలకు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయం ఎంపీ

నంద్యాల,నవంబర్ 24 (ప్రజాస్వరం):

తక్కువ ఖర్చుతో ఆధునిక వైద్యం పేదలకు అందాలన్నదే భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగానే భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల వైద్యం కోసం నిధుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం నంద్యాల పద్మావతి నగర్ ఆర్చీ ప్రక్కన డాక్టర్. వడ్డు. సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వి ఎస్ ఆర్ ఆర్థోపెడిక్, స్పైన్ ఆసుపత్రిని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. గతంలో అత్యవసర మంచి వైద్యం కోసం హైదరాబాద్ నగరంకు వెళ్ళేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, జిల్లా కేంద్రమైన నంద్యాl పట్టణంలో అన్ని రకాల, అన్ని విభాగల అనుభవం గల వైద్యులు, కార్పొరేట్ ఆసుపత్రులు అందుబాటులో ఉన్నాయని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. సేవాభవం గల వైద్యులు కూడా నంద్యాల లో ఉండడం పేద రోగుల అదృష్టం అన్నారు. ఏ. కోడూరు గ్రామానికి చెందిన వడ్డు. సంజీవ రెడ్డి కర్ణాటక రాష్ట్రం మణిపాల్ మెడికల్ యూనివర్సిటీ లో ఎం బి బి ఎస్ చేసి, కేరళ రాష్ట్రం కోచ్చి మెడికల్ ట్రస్ట్ లో పీ జీ చేసి, మహారాష్ట్రలోని ఛత్రపతి షంబాజీ నగర్ లో ఆర్థోపెడిక్, స్పైన్ సర్జన చేసి నంద్యాలలో ఆర్థోపెడిక్, స్పైన్ ఆసుపత్రి ప్రారంభించడం ఇక్కడి రోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అందుబాటులోకి ఆధునిక వైద్యం రావడం మంచి పరిణామం అన్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల సీనియర్ డాక్టర్లు డాక్టర్ జి రవికృష్ణ,డాక్టర్. మధుసూదన్ రెడ్డి, డాక్టర్. గెలివి. సహదేవుడు. డాక్టర్. మురళీధర్,డాక్టర్. విష్ణు వర్ధన్ రెడ్డి, డాక్టర్. లీలా ప్రసాద్ యాదవ్, డాక్టర్. అనిల్ కుమార్ రెడ్డి, డాక్టర్. నర్మద, డాక్టర్. మేనక, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి. విశ్వనాధ్ రెడ్డి, మాజీ ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు వడ్డు. వెంకటరెడ్డి, వడ్డు. సంజీవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాత మతకల్ అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి

- **భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు**

తాండూర్,నవంబర్ 24(ప్రజాస్వరం):



కర్ణాటక రాష్ట్రం,సేడం తాలూకా మదికంటి గ్రామంలో వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఆదిశక్తి స్వరూపిణి మాత మతకల్ గ్రామ దేవతను తెలంగాణ శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కరణం పురుషోత్తం రావు, బిర్కిట్ రఘు, రాజశేఖర్‌తో పాటు గ్రామ పెద్దలు మాధవరెడ్డి, వెంకట్ రెడ్డి,నర్సిరెడ్డి,శానగౌడ,జనార్దన్‌రెడ్డి, కిష్టారెడ్డి,సాయిలు యాదవ్, దానప్ప,సిద్ధు పూజారి,ఆలయ పూజారి శానప్ప బోయిన్, కొణింటి శామప్ప తదితరులు పాల్గొన్నారు.



కార్తీక పౌర్ణమి వేళ.. శివాలయాలకు పోటెత్తిన భక్తులు!

మొదటిపేజీ తరువాయి

పోటెత్తారు. వేములవాడ, కాళేశ్వరం, కీసరగుట్ట, వేయిస్తంభాల గుడి, శ్రీశైలం, శ్రీకాళహస్తి, పంచారామ క్షేత్రాల్లో భక్తుల రద్దీ కనిపిస్తోంది. భక్తుల తాకిడికి అనుగుణంగా ఆలయ అధికారులు ప్రత్యేక క్యూలైన్లు, దర్శన ఏర్పాట్లు చేశారు. ఇక, గోదావరి, కృష్ణా నదీ తీరాల్లో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి కార్తీక దీపాలను నదుల్లో వదులుతున్నారు. తులసి, ఉసిరి చెట్ల వద్ద మహిళలు 365 వత్తులతో దీపారాధనలు నిర్వహిస్తున్నారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతుండటంతో పుణ్యక్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగుతున్నాయి.

కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో భక్తుల సందడి

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని గోష్పాద క్షేత్రానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే గోదావరి నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి, కార్తీక దీపాలను నదిలో వదిలారు. అనంతరం సుందరేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామస్మరణతో క్షేత్రం మార్మోగింది. ఈ సందర్భంగా భక్తులు సాలిగ్రామ దానం, దీపదానం, స్వయంపాక దానాలు చేశారు. గోదావరి స్నానఘట్టాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు, ఫైర్ సిబ్బంది భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

బాపట్ల సూర్యలంక తీరానికి పోటెత్తిన భక్తులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా బాపట్ల జిల్లాలోని సూర్యలంక సముద్ర తీరానికి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. తెల్లవారుజాము నుంచే సముద్ర స్నానాలు ఆచరించారు. అనంతరం ఇసుకతో సైకత లింగాన్ని రూపొందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా,పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ధర్మపురిలో గోదావరి దీపాల వెలుగులు

జగిత్యాల జిల్లా ధర్మపురిలోని గోదావరి నదికి కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వేకువజామునే నదికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలను నదిలో వదిలారు. భక్తులు వదిలిన దీపాలతో గోదావరి నది దీపకాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోయింది. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలోనూ భక్తుల సందడి నెలకొంది.

కాళేశ్వరంలో ఘనంగా లింగోద్భవ పూజలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో వైకుంఠ చతుర్దశిని పురస్కరించుకుని శ్రీ ఆదిముక్తీశ్వర స్వామి ఆలయంలో లింగోద్భవ పూజలు ఘనంగా నిర్వహించారు.అర్చకులు స్వామివారికి లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం, హారతి, మహామంత్ర పుష్పం, చతుర్వేద సేవ నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో భక్తులు స్వామివారికి మారేడు దళాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం



వైకుంఠ వత్తిని వెలిగించి భక్తిని చాటుకున్నా గుండా స్వామివారు ప్రదక్షిణ చేయనుండటంతో ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే కార్తీక పౌర్ణమి వేడుకలతో వేములవాడ పట్టణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ప్రముఖ శైవక్షేత్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ శైవక్షేత్రాలైన శ్రీశైలం,శ్రీకాళహస్తి,కీసరగుట్ట,వేయిస్తంభాల గుడి, పంచారామ క్షేత్రాల్లోనూ భక్తుల రద్దీ కొనసాగుతోంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక క్యూలైన్లు, దర్శన ఏర్పాట్లు చేపట్టారు.నదీ తీరాల్లో భద్రతా చర్యలను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలు, నదీ తీరాలు దీపాల కాంతులతో వెలిగిపోతుండగా..భక్తులు శివనామస్మరణతో ఆధ్యాత్మిక ఆనందంలో మునిగితేలుతున్నారు.





కార్తీక పౌర్ణమి వేడుకలు.. దీపకాంతులతో కోదండ రామాలయం.....

- **ఆకట్టుకున్న శివుడి రూపం.....**

మెదక్ నవంబర్ 24 (ప్రజా స్వరం)

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మెదక్ పట్టణంలోని శ్రీ కోదండ రామాలయం దీపాలంకరణతో దేదీప్యమానంగా వెలిగిపోయింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా శివుడి రూపంలో ఏర్పాటు చేసిన దీపాలంకరణ, త్రిశూల ఆకృతిలో వెలిగించిన దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శివుడి చుట్టూ వెలిగించిన దీపాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. దీపకాంతుల నడుమ కొలువుదీరిన శివుడి రూపం భక్తులకు కనువిందు చేసింది.





పొగాకు విక్రయదారులకు ఎస్ఐ సుప్రియ హెచ్చరిక!

- **విద్యాసంస్థల పరిసరాల్లో అమ్మకాలు పూర్తిగా నిషేధం**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు ఎస్ఐ సుప్రియ**

నిర్మల్ జిల్లా,నవంబర్ 24 (ప్రజాస్వరం):

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే సహించేది లేదని, విద్యాసంస్థల పరిసరాల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భైంసా రూరల్ ఎస్ఐ సుప్రియ హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలలకు 100 గజాల పరిధిలో సిగరెట్లు, బీడీలు, గుట్కా తదితర పొగాకు ఉత్పత్తులను విక్రయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. నిబంధనలు తెలిసి కూడా ఉల్లంఘించే దుకాణదారులపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేశారు.

సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల ప్రకటనల నిషేధం, వ్యాపార నియంత్రణ, ఉత్పత్తి, సరఫరా, పంపిణీ చట్టం-2003 (సిఓటీపిఏ) సెక్షన్ 6(బి) ప్రకారం విద్యాసంస్థలకు 100 గజాల (సుమారు 91.44 మీటర్లు) పరిధిలో పొగాకు ఉత్పత్తులను విక్రయించడం, విక్రయించేందుకు నిల్వ ఉంచడం నిషేధమని ఎస్ఐ తెలిపారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే పొగాకు అలవాట్లకు బానిసలు కాకుండా అడ్డుకోవడం, వారి ఆరోగ్యాన్ని కాపాడటం పోలీసుల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో భైంసా రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యాసంస్థల సమీపంలో ఉన్న పాన్‌షాపుల యజమానులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. దుకాణాల్లో నిల్వ ఉన్న పొగాకు ఉత్పత్తులను వెంటనే తొలగించాలని, వాటి విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. ముఖ్యంగా 18 సంవత్సరాల లోపు వయస్సు గల బాలబాలికలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదని స్పష్టం చేశారు.

నోటీసులు అందుకున్న దుకాణ యజమానులు ఏడు రోజుల్లోగా నిబంధనలు పూర్తిస్థాయిలో పాటించినట్లు పోలీస్‌స్టేషన్‌కు ధృవీకరణ అందించాలని ఎస్ఐ సుప్రియ ఆదేశించారు. గడువు ముగిసిన తర్వాత కూడా నిబంధనలను ఉల్లంఘిస్తూ పొగాకు ఉత్పత్తుల విక్రయాలు కొనసాగించినట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణ యజమానులపై (సిఓటీపిఏ)చట్టంతో పాటు ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.







ఘనంగా అన్న ప్రసాద సమర్పణ

ప్రజాస్వరం,,
మనోహరబాద్ :

కార్తిక పౌర్ణమి పురస్కరించుకొని మంగళవారం కాల్లాకల్ శ్రీశ్రీశ్రీ అనంతగిరి మహారాజ్ ఆశ్రమ ఆవరణలో గల దత్తాత్రేయ స్వామి వారి ఆలయంలో పురం మహేశ ఆధ్వర్యంలో అన్నప్రసాధ వితరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. అయ్యప్ప స్వాములు మరియు దత్తాత్రేయ స్వామి వారి భక్తులు, ఆనందగిరి మహారాజ్ శిష్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

















EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999